
శ్రీ వేంకటేశ్వర స్వామి సుప్రభాతంతో తెల్లారుజామున నాల్గింటికే గడియారంలో అలారం రాగయుక్తంగా వినిపించి కళ్ళు తెరిచాను. మంచంపై లేచి కూర్చొని అందుబాటులో వున్న గడియారం బటన్ నొక్కాను. అలారం ఆగిపోయింది.

ఒళ్ళు విరుచుకొని లేచి బాత్‌రూమ్‌లో కెళ్ళి కాలకృత్యాలు తీర్చుకున్నాను. బెడ్‌రూమ్‌లో మాచెల్లెలి కొడుకు రాఘవ.... ముందు రూమ్‌లో మా అబ్బాయ్ ఉదయ్ ఆదమరచి హాయిగా నిద్రపోతున్నారు. వాళ్ళకేమాత్రం నిద్రాభంగం కలగకుండా బయటి తలుపులు తెరిచి... ఓ కుర్చీ తీసుకొని వెళ్ళి ఆరుబయట వేశాను.



# నిజం ఈ కథ

వావికోలను రాజ్యలక్ష్మి

చల్లని పిల్లతెమ్మెరలతో వాతావరణం చాలా హాయిగా ఆహ్లాదకరంగా వుంది. గేట్ ఎడంవైపున కరివేపాకు చెట్టుపై కోకిల 'కుహూ<...' అంటూ మధురంగా ఆలపిస్తూంది. దానికి తోడు గుమ్మం ప్రక్కనే వున్న కిటికీకి ఆనుకొని గుబురుగా అల్లుకొని వున్న మనీప్లాంట్‌లో ఈ మధ్యనే ఓపక్షి కట్టిన గూడులో వున్న తల్లీ పిల్ల కిచకిచలాడుతున్నాయి.

మోకాళ్ళనొప్పులు కాబట్టి, క్రింద కూర్చోలేను. కుర్చీలో కూర్చొని ఓ నలభై నిమిషాలు ప్రాణాయామం నిర్విఘ్నంగా చేశాను. మెల్లిమెల్లిగా వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. లోపలికెళుతూ గుమ్మంప్రక్కనే వున్న మెట్టుపై నిల్చుని ఓసారి ఆ పక్షి తల్లికి పిల్లకీ గుడ్‌మార్నింగ్ చెప్తున్నట్లుగా నవ్వుతూ చూశాను. తల్లి రెక్కల మాటున వెచ్చగా వున్న ఆ పక్షికూన కిచకిచలాడు తుండడం చూసి నా మనస్సంతా ఆనందంతో నిండి పోయింది.

మొదటినుంచి నాకు జంతువుల కంటె పక్షు లంటేనే ఎంతో ఇష్టం. ఎన్నడూ ఊహించని విధంగా ఓ పక్షి ఇక్కడిలా గూడు కట్టుకోవడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

లోనికెళ్ళి ఓ లీటర్ నీరు తాగాను. ఓ గంట సేపు ధ్యానంలో కూర్చున్నాను.

ఆరింటికి లేచి స్నానం పూజా కార్యక్రమాలు ముగించుకొని వంటింట్లోకెళ్ళి పిల్లలకి టిఫిన్... వంటపని చేయడంలో నిమగ్న మైనాను.

మంతేన సత్యనారాయణగారి ప్రకృతి విధానాలను ఓ మూడు సంవత్సరాల నుంచి పాటిస్తున్నాను. వాటిలో భాగమే ఏడున్నరకి పచ్చి కూరగాయలతో ఓ గాజుగ్లాసెడు రసం తీసుకొని అందుబాటులో ఓచెంచాడు తేనె...ఓ చెక్కనిమ్మరసం పిండుకొని త్రాగాను.

ఎనిమిదన్నరకల్లా మా ముగ్గురికి టిఫిన్ బాక్సులు రెడీ చేశాను. మా రాఘవ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇన్ఫోసిస్ కంపెనీలో, మా వాడికేమో రిలయన్స్‌లో జాబ్.

మొలకగింజలు, కర్జూరం, ఏదైనా ఓ పండు నా టిఫిన్, ఎనిమిదన్నరకి మొలకగింజలు పెసలు తింటూ బయటకుర్చీలో కూర్చోవడం నాకలవాటు ఆ పక్షికి కూడా ఓ మనీప్లాంట్ ఆకుపై కొన్ని పెసలు వుంచాను తినడానికి.

అది చూసిన మా ఉదయ్ "ఓహోఁ పక్షిపిల్లకి కూడా పౌష్టిక ఆహారం" అంటూ నవ్వుతూ ఆఫీస్‌కెళ్ళడానికి తయారవుతున్నాడు.

ఓ పదినిముషాలలో నన్ను బండిపై మా స్కూల్ "చైతన్య" దగ్గర దించి వాడు ఆఫీసుకెళ్ళి పోయాడు.

✿ ✿ ✿

ఆ రోజు ఆదివారం. ఇంట్లోనే తీరుబాటుగా వున్నాను. ఉన్నట్లుండి బయట పక్షుల జంట పెద్దగా చాలా గోలగోలగా "కికూఁ..... కికూఁ...." అంటూ తెగ అరుస్తున్నాయి. వాటితో పాటు పక్షికూన అరుపు కూడా వినిపించింది.

ఏమైందోనని ఒక్క వుదుటున బయటి కెళ్ళాను. గూడు ఖాళీ !... అందులో పక్షికూన లేదు. నా గుండె జల్లుమంది. బాత్‌రూమ్ కప్పుపై కూర్చొన్న జంటపక్షులు అదేపనిగా అరుస్తున్నాయి. వాటి దృక్కులను సారిస్తూ నేనూ అటే చూశాను. వాటి అరుపులకు కారణం అప్పుడర్థమైంది. ఎడంవైపు నున్న బట్టలుతికే సిమెంట్ చప్టాపై వున్న నీళ్ళడబ్బాపై పక్షికూన కూర్చొని అరుస్తూ.... ఈ కొత్తలోకాన్ని భయంభయంగా చూస్తూంది.... చిన్న చిన్న కళ్ళతో, వచ్చీరాని రెక్కలతో ఎగురుతూ వచ్చి అక్కడ ఆగి పోయింది కాబోలు బుజ్జిముండ!..గూట్లో వున్నప్పుడు సరిగ్గా కనబడలేదు గాని, ఇప్పుడు మాత్రం నిండుగా బాగానే వుంది. చాలా ముద్దొస్తుంది. ఏం చేయాలో నాకో క్షణం తోచలేదు. అప్పుడే ఎవరో పంపినట్లుగా మా పనిమనిషి లక్ష్మమ్మ వచ్చింది.

ఆమెద్వారా దాన్ని మెల్లిగా పట్టి తెచ్చి మళ్ళీ మునపటిలా జాగ్రత్తగా గూటిలో వుంచాము. 'ఒసే నీకింకా రెక్కలు సరిగా లేవు. అప్పుడే ఎగరడానికి మిడిసిపడకు' అంటూ ఓ వార్నింగ్ ఇచ్చాను. నేనూ లక్ష్మమ్మ లోపలికొచ్చాము.

నేను కాస్తా తలుపు చాటుగా నిలబడి చూస్తున్నాను. అరుస్తున్న పక్షిజంట నెమ్మదిగా గూటి దగ్గరికి చేరాయి. కూననోట్లో నోరుపెట్టి అవి తమ ప్రేమనంతా వ్యక్తం చేస్తున్నాయి. 'ఈ సృష్టిలో ఏ జీవికైనా తల్లిప్రేమ ఒకటేగదా !'. అని అనుకోగానే నా కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

ఆ తర్వాత రెండు మూడు రోజులకి ఓ పెద్దదైన మనీప్లాంట్ ఆకుపై కొంచెం పొడి అన్నం వుంచాను. తల్లిపక్షి అది తీసుకొని పిల్లకూనకి తినిపిస్తుందేమోనన్న భావంతో.

ఒకే పిల్ల కాబట్టి సరిపోయింది. ఏ రెండు మూడు పిల్లలో వుండుంటే ఈ గూడు వాటి బరువుకి ఏమైయేది? నారతో, గడ్డితో... ప్లాస్టిక్ తీగలతో కొబ్బరిచిప్పంత గుండ్రంగా వీటినిలా అల్లడం ఆ భగవంతుడెలా నేర్పాడో ?

గూటిలో వున్న ఒక్కపిల్ల నిండుగా వుంది. తల్లిపక్షి ఆహారంతో రాగానే ఇంతెత్తున గూటిలో నుంచి లేస్తూ మెడ సారిస్తూ ఆత్రంగా దాన్ని అందుకునేది. ఇక ఏ రెండు మూడు రోజులే వుంటుందదీ గూట్లో . ఎందుకంటే రెక్కలిప్పుడు దానికి బాగానే వచ్చాయి.

నేననుకున్నట్లుగానే ఆ మర్రోజే సాయంత్రం ఆ పక్షికూన అలా అలా గాలిలో చక్కగా ఎగిరి పోయింది. తల్లిపక్షి కూడా దాని వెనకాలే వుంది. ముందు బాత్‌రూమ్ కప్పుపై వాలింది. అక్కడ కాసేపు వుండి పిట్టగోడపై.... అక్కడి నుంచి ఎత్తైన జామచెట్టు మీదికి ఎగిరిపోయింది. ఇంతలో మగపక్షి కూడా వచ్చి వాటితో కల్సింది. నేనూ కాసేపు వాటి వెనకాలే తిరిగి జామచెట్టు క్రింద ఓ క్షణం నిల్చుని వాటిని చూసి "హమ్మయ్య ! ఇక భయం లేదు' అని తృప్తిగా నిట్టూర్చి ఇంట్లోకి రాబోతుంటే... గూడు ఖాళీగా వుండి బోసిపోయినట్లుగా అన్పించే సరికి నా మనస్సంతా బాధతో నిండిపోయింది.

✿ ✿ ✿

స్కూల్‌కి ఆర్నెల్లు సెలవుపెట్టి లండన్‌లో వున్న మా అమ్మాయి అల్లుడిగారి దగ్గరకెళ్ళి తిరిగి హైద్రాబాద్‌కు వచ్చేసరికి.... మా ఇల్లంతా నాకు చాలా కొత్తగా అన్పించింది. ఇంటిముందు గుబురుగా పెరిగిన మనీప్లాంట్ లేదు. కిటికీ దగ్గరున్న పక్షి కట్టిన ఆ ఖాళీ గూడు కూడా లేదు. ఒక్క క్షణం చాలా బాధన్పించింది. పందికొక్కు రాత్రిళ్ళు వచ్చి మనీ ప్లాంట్‌నంతా వేరుతో సహా తవ్వి కొరికి పడేసిందని మా ఉదయ్ చెప్పాడు. మనీప్లాంట్ పార దానికి కిటికీ అల్లిబిల్లిగా కట్టిన తాళ్ళు మాత్రం ఉన్నై. ఆ మర్రోజే వేరే కుంపటిలో ఎరుపు మట్టితో నింపి మనీప్లాంట్ కొమ్మ తెచ్చి నాటాను.

కొన్నాళ్ళు గడిచాయి. నాదైనందిన కార్య

# స్వయంప్రేరణ

మౌన వల్మీకాన్ని విదిలించుకుని
రాగభుజంగం శిరసెత్తి ఊగింది.
అది ఏ బాహిరశక్తులో ఊదిన
నాగస్వరాలు వింటే జరిగిన
పరిణామం కాదు.
స్వయం ప్రేరిత స్ఫూర్తితో రూపొందిన
సహజ పరివర్తనం.
పడగెత్తి ఆడడంలో వున్న ఉద్దీప్తి
ముడుచుకుని వుండడంలో ఎక్కడిది ?
వాయు వలయాన్ని తనలోకి చేదుకుంటూ
సాగిపోయినప్పుడే
ప్రాణసంపుటికి వినూతన వికాసం.
మొగ్గల్లో బందీలుగా వున్న పరిమళాలు
తహతహలాడుతుంటాయి
ఆ పంజరాల్లోనుంచి బయటపడి
స్వేచ్ఛగా ప్రసరించేదెప్పుడా అని.
నిర్నిద్ర యోగముద్రలను
అనివార్య పరిస్థితుల్లో
అలవరచుకున్న నేత్రాలు
ఆ నియమానికి కట్టుబడి వున్నా
పాదాలు మాత్రం
తాము కదిలిపోయేదెప్పుడా అని
విహ్వలిస్తుంటాయి
ఎగిసి ఎగిసి అలిసిపోయిన మనసు
మననం కోరుకున్నా
తనువు మొగ్గు గమనంవైపే
అది అనివార్యం.
స్వచ్ఛంద గతిలో వున్న సంతృప్తి
నిశ్చల స్థితిలో వుండదేమో

డా॥ సి.నారాయణరెడ్డి

క్రమాలలో పడిపోయాను.

ఒకరోజు వున్నట్లుండి ఆ పక్షుల అరుపులు వినవచ్చాయి. బయటికి ఆత్రంగా వచ్చి చూశాను. కిటికీకి వున్న అల్లిబిల్లి తాళ్ళ ఆసరాతో ఆ పక్షులు గూడు కట్టుకోసాగాయి. నాకెంతో సంతోషమనిపించింది. మూడు నాల్గురోజుల్లోనే గూడు రెడీ అవ్వడం... ఆడపక్షి గుడ్లు పెట్టి పిల్లల్ని పొదగడం అన్నీ ఇట్టే చకచకా జరిగిపోయాయి. ఈసారి ఒకటి రెండు కాదు. మొత్తం ముచ్చటగా మూడు పిల్లల్ని లేపింది. వాటిని చూస్తూంటే నాకెంతో ఆనందంగా వుంది.

ఓ వారం రోజులకల్లా ఆ గూడు పిల్లల బరువుకి... వాటి కదలికలకు క్రిందకి జారిపోతున్నట్టుగా తోచింది నాకు. పక్షులు కూడా అది గమనించాయి కాబోలు - గూటికి సపోర్టుగా గడ్డిపరకల్ని తెచ్చి పెడుతున్నాయి. కాని అది ఆగేలా కన్పించడం లేదు. వెంటనే నాకో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఓ తెల్లటి ప్లాస్టిక్ కవర్ తెచ్చి దాన్ని ఆ గూడు క్రింది నుంచి జోలెలాగ కట్టి అటు ఇటు బట్టలకి పెట్టే క్లిప్స్ గట్టిగా నొక్కి పెట్టాను. ఆ పసిబిడ్డలతో ఆ గూడు కూలిపోతే.... అమ్మో ! ఇక ఆపైన ఊహించలేకపోయాను.

ఓ రెండు మూడు రోజులు తాపీగా గడిచాయి. నాలుగవ రోజు ఉదయం నేను నిద్ర లేచేసరికి గూడు ఖాళీ ! పక్షి పిల్లలు లేవు. విస్తుపోయాను. 'గూడు కూలిపోతుందేమోనన్న భయంతో పిల్లల్ని రాత్రికి రాత్రే వేరే చోటికి తీసికెళ్ళాయేమో !' అని అనుకున్నాను. కాని నా ఆలోచనలు నాకే చాలా పిచ్చిగా అన్పించాయి. ఎందుకంటే పిల్లి తన పిల్లల్ని ఒకచోటు నుండి మరో చోటికి తీసుకెళ్ళేట్లుగా పక్షులకు కూడా అలాంటి ఆస్కారం వుందా? ఏమో...! నాకర్థం కాలేదు. మనస్సంతా బాధగా అదోలా వుంది. లేచి బ్రెష్ చేసుకుంటున్న రాఘవ దగ్గరికెళ్ళి బాత్‌రూమ్ ముందు నిల్చుని పక్షి పిల్లల సంగతంతా విచార వదనంతో వివరించాను.

అది వినగానే వాడు "అవునా?!...." అంటూ అసలే తన పెద్దవైన కళ్ళను మరింత పెద్దవి చేసి చూస్తూ బయటికెళ్ళాడు.

నేను అన్యమనస్కంగానే వంటింట్లోకెళ్ళి కూరలు తరగసాగాను. రాఘవ గబగబా లోపలికొచ్చి "బిగ్ మమ్మీ ! ఆ పిల్లల్ని పక్షులెక్కడికి తీసికెళ్ళలేదు. గండుమార్జాలస్వామి రాత్రి వాటిని గుటకాయస్వాహా చేశాడు. నాతోరా !.... చూపిస్తాను నీకు " అంటూ వాడో డిటెక్టివ్‌లా ముందుకు కదిలాడు.

"నిజమా" అంటూ మంత్ర ముగ్ధలా వాని వెనకాలే బయటికొచ్చాను.

"ఇదిగో, బిగ్‌మమ్మీ ! ఉదయస్నయ్య స్కూటర్ సీట్ పైనున్న ఈ కాలిముద్రలు చూడు.

"నిజమే, పిల్లి మట్టికాళ్ళ గుర్తులవి ! తేలిగ్గానే గుర్తించాను. ఆ పక్షిపిల్లల్ని రాత్రివేళ ఈ స్కూటరెక్కి వాటిని సుబ్బరంగా తినేసుంటుంది."

"ఒరేయ్, రాఘువా ! ఇక చెప్పకురా. మీ పెద్దనాన్న స్కూటర్ కొన్నప్పటినుంచి దాన్ని పెట్టే స్థలం ఇదేరా !...." నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అయ్యో, పాపం ! ఆ పసికూనలను పిల్లి తినేయడం విన్న నేను భరించలేకపోతున్నాను.

కొన్నాళ్ళవరకు అదే సంఘటన పదే పదే నా కళ్ళముందు కదలాడసాగింది. మర్చిపోలేకపోయాను.

కొన్ని నెలలు గడిచాయి. ఓ రోజు ఉదయం ఆ పక్షి జంట వచ్చినట్లుగా బయట వాటి సుపరిచితమైన అరుపులు వినిపించాయి. ఆసక్తిగా బయటికి వచ్చి చూశాను. రెండు పక్షులు కిటికీ దగ్గరగా వాలి గలాటాగా అరుస్తున్నాయి.

"మమ్మీ ! నీ పక్షులు మళ్ళీ డెలివరీకి వచ్చినట్లున్నాయి చూడు.." అని నవ్వుతూ మా ఉదయ్ వాటి అరుపుల సారాంశాన్ని ఈ విధంగా తెల్పాడు.

ఆడపక్షి : ఉహూ c.... ఇక్కడిక గూడు కట్టవద్దు. పోయినసారి నా పిల్లల్లో ఒక్కటైనా బ్రతికిందా ? ఆ పిల్లి అన్నిటిని పొట్టన పెట్టుకుంది. వద్దు !.... ఇక్కడ మనం ఈసారి గూడు కట్టొద్దు.

మగపక్షి : అయ్యో ! అలా మాట్లాడతావేమిటి? ఒకసారి జరిగితే ప్రతిసారీ అలాగే జరుగుతుందా? ఇక్కడే మనం గూడు నిర్మించుకుంటే అన్నింటికీ చాలా సదుపాయంగా వుంటుందని నా అభిప్రాయం.

"ఇక్కడ వద్దే వద్దు !....." ఆడపక్షి భర్తకు ఖరాఖండిగా జవాబు చెప్తూ అసహనంగా చివ్వున ఎగిరిపోయింది. దాని వెనకాలే గోలగా అరుస్తూ మగపక్షి కూడా ఎగిరిపోయింది.

తనకేంటో పక్షిభాష తెలిసినట్లుగా వాటి అరుపులను తర్జుమా చేసి నాతో మా అబ్బాయ్ ఉదయ్ చెప్పడం విన్న నేను నవ్వుతూ "నీకు మాతృభాషే తిన్నగా రాదు. ఇక పక్షి భాష కూడానా నీ ముఖానికి?" అంటూ ఓ చురక తగిలించాను.

"ఏంటీ, మమ్మీ ? ప్రతిసారి నాకు తెలుగు రానట్లుగానే దెప్పుతావేంటి ?"

"మరి నీకు తెలుగొచ్చా?

"రాయడం... చదవడం రాకపోతేనేం... చక్కగామాట్లాడుతూనే వున్నానుగా మాతృభాషలో.."

"అదికాదురా ఉదయ్ ! పదహారేళ్ళుగా నేనో తెలుగు టీచర్ని అయి... ఎన్నో వందల మందికి తెలుగు నేర్పాను. తమ మాతృభాష తెలుగు కాకపోయినా వాళ్ళకి కూడా ఇట్టే చక్కగా తెలుగు నేర్పాను. ఇంట్లోని కన్నకొడుకుకే తెలుగు నేర్పలేకపోయాను. ఊరెళ్ళితే మీ మామయ్య వాళ్ళంతా ఏమో 'నీ కొడుకూ ఎర్రబస్సెక్కేవాడూ ఒకటేనని ఎగతాళి చేసి నవ్వుతారు తెలుసా?....."

"నవ్వనీ... మన మామయ్యలేగా..." వాడు తేలిగ్గా తీసి పారేశాడు.

మావారు డిఫెన్స్‌లో ఉద్యోగం కాబట్టి ఇండియాలో పలుచోట్ల తిరిగాము. ఢిల్లీ... అస్సాం, బెంగుళూర్, గుజరాత్, హైద్రాబాద్. చదివింది సెంట్రల్ స్కూల్లో కాబట్టి తెలుగు సబ్జెక్టే లేదాయె ! ఇంట్లోను స్కూల్‌లోను అంతా హిందీయే. నేను మాత్రం ఇంట్లో పిల్లలతో పూర్తిగా తెలుగులోనే మాట్లాడడం వలన కనీసం ఇలా అయినా మాట్లాడగల్గుతున్నాడు. మా అమ్మాయే నయం చదివింది మెడిసిన్ అయినా ఒక నెలలో తెలుగు రాయడం చదవడం క్షుణ్ణంగా నేర్చుకుంది. కాని, వీడికి మాత్రం తెలుగు నేర్పడం నావలన కాలేదు.

మేము హైద్రాబాద్‌కు వచ్చిన మొదట్లో ఫిరోజ్‌గూడలో ఒక మిలటరీ డాక్టర్ రెడ్డిగారింట్లో అద్దెకుండేవాళ్ళం. ఆయనకోసం పేషంట్స్.... మెడికల్ వాళ్ళు ఎందరో రోజూ వాళ్ళింటికి వస్తూ పోతూ వుండేవారు. అప్పుడు మా ఉదయ్ ఫిఫ్త్ క్లాసులో వుండేవాడు.

ఒకరోజు వాడు బయట ఆడుతూ వుంటే

## గిన్నిస్‌లో కెక్కిన అతి పొట్టి హీరో

**ప్రపంచంలోకెల్లా అతి పొట్టి హీరోగా మలయాళ సినీ నటుడు అజయ్ కుమార్ గిన్నీస్‌బుక్‌లో స్థానం సంపాదించాడు. 'అద్భుతద్వీప్' సినిమాలో పూర్తిస్థాయి హీరోగా నటించి ఆయన ఈ ఘనత సాధించాడు. అసహాయత నుంచి హాస్యం పండించే 'అద్భుతద్వీప్' మలయాళంలో పెద్ద హిట్‌గా నిలిచి, పలుభాషల్లోకి అనువాదమైంది.**

ఎవరో వచ్చి "ఇంట్లో డాక్టర్‌గారున్నారా బాబూ?" అని అడిగాడు.

"అబ్బే, లేదు ఊరెళ్ళాడు..." మా వాడి సమాధానం.

కిటికీగుండా నేనంతాగమనిస్తూనే వున్నాను.

"ఎప్పుడొస్తాడు?"

"నిన్న వస్తాడు" మా వాడి తెలుగు పాండిత్యానికి అవతలి మనిషి ఖంగు తిని ఎప్పుడెళ్ళారు?" మరో ప్రశ్న సంధించాడు.

"ఎల్లుండి వెళ్ళాడు." మావాడు గోలీలాట ఆడుతూ తాపీగా చెప్పాడు జవాబు.

ఆ సమాధానంతో ఆ మనిషి వీడ్ని తినేసేలా చూస్తూ కోపంగా వెళ్ళిపోయాడు. అది గుర్తొచ్చి నవ్వుకున్నాను.

"ఎందుకు మమ్మీ నవ్వుతున్నావ్?"

నేను మళ్ళీ నవ్వాను.

"నేనిప్పుడు తెలుగు బాగానే మాట్లాడుతున్నానుగా..."

"నీవిప్పుడు బాగానే మాట్లాడుతున్నావ్ కాని, చిన్నప్పుడు ఉల్టాసీదాగా మాట్లాడే నీ తెలుగు భాషను తల్చుకుంటే నవ్వొస్తుంది నాకు. 'స్నానానికి నీళ్ళు వేడిచెయ్' అనే పదానికి బదులుగా 'స్నానానికి నీళ్ళు ఉడకబెట్టు మమ్మీ!' అనేవాడివి" అంటూ మళ్ళీ నవ్వాను.

నా మాటలకు వాడూ నవ్వాడు.

ఓ మూడు రోజులు అయ్యాక ఆ పక్షులు మళ్ళీవచ్చి కిటికీదగ్గర కాకుండా ఈమారు గోడకానుకొని వున్న మైసూర్ మల్లెచెట్టుకు గూడు అల్లడం మొదలుపెట్టాయి. నాకేమో అది నచ్చలేదు. ఎందుకంటే వచ్చిపోయే వాళ్ళకు కొమ్మలు తగిలి చెట్టంతా కదులుతుంది. అక్కడికీ ఇటువైపు నున్న కొన్ని కొమ్మల్ని విరిచి కూడా వేశాను.

గూడు రెడీ అయి ఆడపక్షి గుడ్లు కూడా పెట్టింది... రాత్రిళ్ళు గూటిలోనే కూర్చునేది. ఓ రోజు రాత్రి మా ప్రక్కింటి పోర్షన్‌లోకి వచ్చిన చుట్టాలెవరో ఆ చెట్టును బాగా తగుల్తూ బాత్‌రూమ్ వైపు వెళ్ళారు.

ఇంకేముందీ..ఆ పక్షి చెట్టుకదలికకు భయాందోళనలతో పెద్దగా అరుస్తూ వాళ్ళింట్లోకి వెళ్ళి పోయింది.నేను బయటికి వచ్చి చూసేసరికి ప్రక్కింటి వాళ్ళు దాన్ని "ఉష్c..! ఉష్ c...." అని చీపురుకట్టతో తరిమేశారు. ఆ పక్షివక్కడ కొన్ని రెక్కలు కూడా ఊడి పోయాయి.నాకెంతో బాధను కల్గించిందా దృశ్యం.

అలా ఆనాడు వెళ్ళిపోయిన పక్షి మళ్ళీ తిరిగి రాలేదు. గూటిలోకి తొంగిచూశాను. రెండు గుడ్లున్నాయి అందులో. ఆ గూడును గుడ్లను కాపాడుతూ నాటి నుంచి నేటివరకు ఆ పక్షి జంట కోసం కళ్ళు కాయలు కాసేలా ఆత్రంగా ఎదురు చూస్తూనే ఉన్నాను.

# లింకన్ చతురోక్తులు

ఒకప్పటి అమెరికా ప్రెసిడెంట్ లింకన్ వైట్‌హౌస్ (శ్వేత భవనం) బేస్‌మెంట్‌లో తన బూట్లను పాలిష్ చేసుకుంటున్నాడు.

అంతలో అక్కడికి లింకన్‌కి తెలిసిన ఒకాయన వచ్చాడు. అక్కడి దృశ్యం చూచి ఆశ్చర్యపడ్డాడు. అమెరికా ప్రెసిడెంట్ అంత గొప్పవ్యక్తి పనివాళ్ళు చెయ్యవలసిన పనిని తానే చేసుకోవటం అతనిని అబ్బురపరచింది.

"అరె ! మీ బూట్లు మీరే పాలిష్ చేసుకుంటున్నారా? అంటూ అడిగాడు.

లింకన్ తాపీగా నవ్వుతూ "కాక ! మరెవ్వరి బూట్లు పాలిష్ చెయ్యమంటారు" అన్నాడు.

అదీ లింకన్ సునిశిత హాస్య స్వభావం !

❖ ❖ ❖

లింకన్‌కి పిల్లలంటే చాలా యిష్టం. పిల్లలు కూడా లింకన్‌ని బాగా యిష్టపడేవారు. గౌరవమూ; అభిమానమూ కనబరిచేవారు.

ఒకరోజున ఒక అమ్మాయి లింకన్‌ని చూడాలని వాళ్ళనాన్నతో కలిసి శ్వేత భవనానికి వచ్చింది.

లింకన్ ఆ అమ్మాయిని ఆత్మీయంగా పలకరించి తనదైన సరదా పద్ధతిలో ఆ అమ్మాయితో కాస్సేపు మాట్లాడాడు. ఆ అమ్మాయి అప్పుడు వాళ్ళ నాన్న వైపు తిరిగి "నాన్నా! ప్రెసిడెంట్‌గారు అసహ్యంగా లేరే ! ఎంతో అందంగా వున్నారు" అని అంది.

అప్పుడు ఆ నాన్న ముఖం చూడాలి !

❖ ❖ ❖

లింకన్ పొరుగున నివసించే రొనాల్డ్ ఒల్లర్ అనే అతను యీ కథ చెప్పాడు.

ఒకరోజు వీధిలో పిల్లల కేకలు వినబడి నేను గుమ్మం దగ్గరకు వచ్చి చూశాను. ఇద్దరు పిల్లల మధ్య నిలబడి వున్న లింకన్ కనిపించాడు. ఆ పిల్లలు పెద్దగా అరుస్తూ కేకలు పెడుతున్నారు.


"ఏమిటి సంగతి లింకన్! ఎందుకా పిల్లలు అలా అరుస్తున్నారు?" అని అడిగాను.

లింకన్ సమాధానం ఇది. "ప్రపంచంలో అంతటా వున్న సంగతే. నా దగ్గర మూడు వాల్ నట్స్ వున్నాయి. వీళ్ళిద్దరికీ ఒక్కొక్కరికి రెండేసి కావాలట."

ప్రతి వ్యక్తిలో సహజంగా వుండే లోభగుణాన్ని ఎత్తిచూపాడు లింకన్.

**సేకరణ : వల్లూరుపల్లి లక్ష్మి**

# గిన్నీస్‌కు పాకిన నవ్వు



అంతర్జాతీయ వేదికను అలంకరించిన మరొక తెలుగు వాడి 'వాడి' ఇది.

ఏ పేరు చెపితే నవ్వు నాలుగు చెరగులా ప్రతిధ్వనిస్తుందో, ఏ రూపు తలచుకుంటే పెద్దవాళ్లు కూడా పసిపిల్లలై నవ్వుతారో ఆ బ్రహ్మానందం గిన్నీస్‌బుక్ ఆఫ్ ది వరల్డ్ రికార్డ్స్ పుస్తకానికి ఎక్కారు. 20 సంవత్సరాల్లో ఒకే భాషా చిత్రాల్లో అత్యధిక సంఖ్యలో అంటే 600 పై చిలుకు చిత్రాల్లో నటించి వరల్డ్ రికార్డును ఆయన సృష్టించారు. ఈ ఖ్యాతి దక్కించుకున్నారు. 'సత్యాగ్రహం' చిత్రం ద్వారా జంధ్యాల చేతుల మీదుగా తెలుగు ప్రేక్షకుడికి పరిచయమయిన ఈయన 'అహనా పెళ్లంట' చిత్రం తర్వాత వెనుదిరిగి చూడలేదు. ఈ రోజుకీ అత్యధిక సంఖ్యలో హాస్య నటులున్న తెలుగు చిత్ర సీమలో ఆయన స్థానం చెక్కు చెదరలేదు. ఈ సందర్భంగా ఆయనకు 'చినుకు' శుభాభినందనలు అందజేస్తుంది